తగ్గేదేలే!



ఆకాశంలో సగం.. అవకాశాల్లో ఘనం.. సాధికారతే ధ్యేయం.. తిరుగులేని ధైర్యం.. తగ్గేదేలే అంటున్న మహిళాలోకం. ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు ప్రైవేట్ రంగంలోనూ అతివలు సత్తా చాటుతున్నారు. డిగ్నిటీ ఆఫ్ లేబర్‌కు నిదర్శనంగా నిలుస్తున్నారు. చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తూ ఆదర్శవంతంగా రాణిస్తున్నారు. ఈ క్రమంలో డెలివరీ బాయ్స్ పేరుతో పురుషులకే పరిమితమైన పనులను సైతం అవలీలగా చేసేస్తున్నారు. పెద్ద బ్యాగ్‌ను తగిలించుకుని ద్విచక్రవాహనాల్లో దూసుకెళుతున్నారు. సకాలంలో ఆర్డర్లను వినియోగదారులకు అందజేస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. శుక్రవారం తిరుపతి నగరంలోని పలు ప్రాంతాల్లో వివిధ వస్తువులను డెలివరీ చేస్తూ కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

అశ్రు నివాళి



కశ్మీర్ ఉగ్రదాడిలో అసువులు బాసిన పర్యాటకులకు ఎస్వీయూ ఉద్యోగులు, విద్యార్థులు అశ్రునివాళులర్పించారు. శుక్రవారం వర్సిటీ పరిపాలన భవనం ఎదుట రెండు నిముషాలు మౌనం పాటించారు. భారత్ మాతాకి జై అంటూ నినదించారు. వీసీ అప్పారావు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడి పిరికిపందల చర్యల అంటూ మండిపడ్డారు. విపత్కర సమయంలో దేశానికి ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ భూపతినాయుడు, నాన్‌టీచింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

– తిరుపతి సిటీ

సెలవు.. సృజనకు నెలవు!

వేసవి సెలవులు వచ్చేశాయి. విద్యార్థుల సందడికి హద్దుల్లేవు. ఈ క్రమంలోనే సృజనాత్మకతను మెరుగుపరిచేందుకు సమ్మర్ క్యాంపులు సైతం అందుబాటులోకి వచ్చాయి. పిల్లల ఆసక్తి.. అభిరుచికి అనుగుణంగా నైపుణ్యాలను తీర్చిదిద్దుకునే వెసులుబాటు కల్పిస్తున్నాయి. విద్యతోపాటు విజ్ఞానం అందిపుచ్చుకునేందుకు బాటలు వేస్తున్నాయి. విశిష్టమైన అంశాల్లో ప్రత్యేకంగా శిక్షణ అందిస్తున్నాయి. ఈ మేరకు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా తిరుపతిలోని పలు ప్రాంతాల్లో వివిధ సంస్థలు మే 1 నుంచి 31వ తేదీ వరకు విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వనున్నాయి. ఇందుకోసం కొన్ని విభాగాలకు మాత్రం పరిమిత రుసుమును వసూలు చేయనున్నాయి.

– తిరుపతి ఎడ్యుకేషన్

- నగరంలో అందుబాటులోకి వేసవి శిబిరాలు
- విద్యార్థుల ఆసక్తి మేరకు నైపుణ్యాభివృద్ధి
- చదువుతోపాటు క్రీడల్లోనూ శిక్షణ



- ఎస్వీ ఆర్ట్స్ కళాశాల మైదానంలో హాకీ, ఫుట్‌బాల్ క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నారు.
- ఎస్వీజీఎస్ఎం పాఠశాలలో వాలీబాల్‌కు సంబంధించి విద్యార్థులకు కోచింగ్ అందుబాటులో ఉంటుంది.
- మంగళం ట్రెండ్స్ పాఠశాలలో జూడోలో ట్రైనింగ్ ఇవ్వనున్నారు.
- ఎంజీఎం నగరపాలక ఉన్నత పాఠశాల, తిరుచానూరు జెడ్పీ హైస్కూల్‌లో రెజ్లింగ్‌లో పిల్లలకు శిక్షణ అందిచనున్నారు.
- శిల్పారామంలోని వేసవి శిబిరంలో పోట్టరి (మట్టి కుండల తయారీ), డ్రాయింగ్–పెయింటింగ్, క్లాసికల్ డ్యాన్స్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు.
- ఖాదీకాలనీలోని మేక్ మై బేబీ జీనియస్‌లో వేదిక్ మ్యాథ్స్, మ్యాథ్స్ బేసిక్స్, తెలుగు, హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో అందమైన చేతిరాత, తప్పులు లేకుండా చదవడం, రెండు చేతులతో రాయడం, స్పోకెన్ ఇంగ్లిష్, రూబిక్స్ క్యూబ్, భగవద్గీత పఠనం, వేమన పద్యాల్లో శిక్షణ ఇవ్వనున్నారు.
- అవిలాల వద్ద ఉన్న భాష్యం బ్లూమ్స్ పాఠశాలలో మే 2నుంచి 28వ తేదీ వరకు వేసవి శిబిరం నిర్వహిచనున్నారు. అందులో భాగంగా ఉదయం 6నుంచి 8గంటల వరకు స్విమ్మింగ్, 7.30 నుంచి 9.30 గంటల వరకు స్కేటింగ్, 9.20నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అబాకస్, కాలిగ్రఫీ, ఒరిగామి, కుకింగ్ , డ్యాన్స్‌లో 6నుంచి 13ఏళ్లలోపు బాలబాలికలకు శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే ఉదయం 6నుంచి 7వరకు ఐదేళ్లపైబడిన వారికి యోగ, ధ్యానంలో తర్ఫీదు ఉంటుంది.
- బాలాజీకాలనీలోని వెస్ట్ చర్చి సమీపంలో ఉన్న ధరణి అబాకస్‌లో ఉదయం 8నుంచి రాత్రి 8.30గంటల వరకు బ్యాచ్‌ల వారీగా అబాకస్, మ్యాథ్స్, ఇంగ్లిష్ గ్రామర్, హిందీ, తెలుగు, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌లో చక్కటి చేతి రాత, తప్పులు లేకుండా చదవడంపై శిక్షణ ఇవ్వనున్నారు.
- కేటీ రోడ్డులోని ఎస్‌జీఎస్ పాఠశాల ఆవరణలోని టెంపుల్ ఆఫ్ తైక్వాండో శిక్షణ కేంద్రం, అలాగే శ్రీదేవి కాంప్లెక్స్‌లోని తైక్వాండో శిక్షణ కేంద్రంలో వేసవి శిబిరాల్లో భాగంగా ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 6నుంచి 8గంటల వరకు గ్రాండ్ మాస్టర్ డాక్టర్ గోపినాయుడు పర్యవేక్షణలో కోచ్‌లు భువన, భవిష్య తైక్వాండో, బాక్సింగ్, ఫెన్సింగ్‌లో ఉచితంగా ట్రైనింగ్ అందించనున్నారు.

శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్

శాప్ ఆధ్వర్యంలో శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పలు రకాల క్రీడల్లో ఉదయం 6 నుంచి 7.30 గంటలు, తిరిగి సాయంత్రం 5 నుంచి 7గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రధానంగా బాక్సింగ్, యోగా, బాస్కెట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, జూడో, టెన్నిస్, స్కేటింగ్, స్విమ్మింగ్, క్రికెట్, రైఫిల్ షూటింగ్ ఉన్నాయి.



- కేటీరోడ్డులోని విశ్వం విద్యాసంస్థలో 3నుంచి 7వ తరగతి విద్యార్థులకు గణితం, సైన్స్, లాజిక్/రీజనింగ్, ఇంగ్లిష్ గ్రామర్, 8నుంచి 10వ తరగతి విద్యార్థులకు గణితం, ఫిజికల్ సైన్స్, బయాలజీ, ఇంగ్లిష్ గ్రామర్, రీజనింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే సైనిక్, నవోదయ, మిలిటరీ పాఠశాలల ప్రవేశ పరీక్షలు, జేఈఈ, నీట్ తదితర పోటీ పరీక్షలకు సంబంధించి రోజు ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

న్యాయమూర్తికి వీడ్కోలు సత్కారం



జడ్జి సరితను సన్మానిస్తున్న న్యాయవాదులు

తిరుపతి లీగల్ : తిరుపతి ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహించి బద్వేలుకు బదిలీపై వెళుతున్న జడ్జి వై.సరితను శుక్రవారం సాయంత్రం తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్ ఘనంగా సన్మానించింది. ముఖ్యఅతిథిగా తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి గురునాథ్ హాజరయ్యారు. జడ్జి సరిత మాట్లాడుతూ వృత్తిలో తనకు సహాయ సహకారాలు అందించిన న్యాయమూర్తులు, న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. అదనపు జిల్లా జడ్జిలు అర్చన, రామ్ గోపాల్, రామచంద్రుడు, సీనియర్ జడ్జిలు విజయసారథిరాజు, సునీత రాణి,జూనియర్ సివిల్ జడ్జిలు వాణిశ్రీ, సత్య కాంత్ కుమార్, సంధ్యారాణి, శ్రీకాంత్, కోటేశ్వరరావు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గొట్టి గజేంద్ర, న్యాయవాదులు నరహరి రెడ్డి, రాజగోపాల్, వెంకట కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం

తిరుపతి రూరల్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దారు రామాంజులు నాయక్ తెలిపారు. శుక్రవారం వేదాంతపురంలో గ్రామ సభ నిర్వహించిన రీసర్వే ప్రాజెక్టుపై రైతులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సి.గొల్లపల్లెలో ఇప్పటికే రీసర్వే దాదాపు పూర్తి చేశామన్నారు. రీసర్వేలో అనుభవదారు, పట్టాదారు వేర్వేరుగా ఉంటే పరిష్కారం చేస్తామని వెల్లడించారు. కోర్టుల్లో నడుస్తున్న సివిల్ కేసులు సైతం కొలిక్కి వచ్చే అవకాశం ఉంటుందని వివరించారు. సర్పంచ్ జనార్ధన్‌యాదవ్ పాల్గొన్నారు.

ఆర్‌డీఓ కార్యాలయం వద్ద చలివేంద్రం



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఆర్‌డీఓ రామ్మోహన్

తిరుపతి అర్బన్ : తిరుపతి ఆర్‌డీఓ కార్యాలయం వద్ద శుక్రవారం చలివేంద్రం ప్రారంభించారు. ఆర్‌డీఓ రామ్మోహన్ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో కార్యాలయానికి వచ్చే సందర్శకుల కోసం చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఏఓ ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు నివాళి



స్వర్ణను ఓదారుస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

పాకాల : వైఎస్సార్‌సీపీ నేత ఎస్.విశ్వనాథరెడ్డి గురువారం ఆకస్మికంగా మృతి చెందారు. శుక్రవారం ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి పాకాలలోని విశ్వనాథరెడ్డి నివాసానికి వెళ్లారు. ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. విశ్వనాథరెడ్డి సతీమని ఎంపీటీసీ సభ్యులు స్వర్ణను ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

డ్రైవర్లకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న సీవీఎస్ఓ హర్షవర్ధన్ రాజు

తిరుమల : తిరుమలలో పనిచేస్తున్న డ్రైవర్లు శ్రీవారి భక్తులతో ఎలా నేర్చుకోవాలి అనే అంశంపై టీటీడీ సీవీఎస్ఓ హర్షవర్ధన్ రాజు అవగాహన సదస్సును నిర్వహించారు. శుక్రవారం తిరుమలలోని ఆస్థాన మండపంలో ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, శాంతిభద్రతలు ముఖ్యమైనవన్నారు. భక్తులతో గౌరవంగా వ్యవహరించాలని కోరారు. నిషేధిత వస్తువులు తిరుమలకు రాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు.

విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సన్మానిస్తున్న చెంగల్‌రెడ్డి

భాకరాపేట : పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎర్రావారిపాళెం మండలం యల్లమంద జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను వైఎస్సార్‌సీపీ విద్యార్థి సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు చెంగల్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు ప్రణవి (561), లావణ్య(506), పూర్ణచంద్ర (506)ను అభినందించారు. నేతలు వీరనాగేంద్ర, నాగులేష్, పరంధామయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, మాలేశ్వరనాయుడు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- భజన భక్త మండలి ఆధ్వర్యంలో ఉదయం 4.45 గంటలకు శ్రీగోవిందరాజస్వామి తిరుమాడవీధుల్లో నగర సంకీర్తన.
- బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సీఎల్‌సీ భవనంలో ఉదయం 10.15 గంటలకు మహిళలకు టైలరింగ్ శిక్షణ ప్రారంభం
- ఏపీ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సాయంత్రం 5 గంటలకు డాక్టర్ మహర్షి బాబు, బి.శ్రీనివాసరావు సంస్మరణ సభ.

వసతుల కోసం నిరసన



నిరసన తెలుపుతున్న రైల్వే ఉద్యోగులు

తిరుపతి అర్బన్ : కనీస వసతులు కల్పించాలని కోరుతూ రైల్వే ఉద్యోగులు శుక్రవారం తిరుపతి రైల్వే స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ప్రధానంగా రైల్వే ఆపరేషన్ విభాగం, జనరల్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులను టాయిలెట్స్‌కు సైతం వెళ్లకుండా నిబంధనలు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైల్వే ఉద్యోగులు రహంతుల్లా, ఆనందబాబు, డీవీఎస్ఎస్‌జీ కుమార్, సురేంద్రనాథ్‌రెడ్డి, బహ్మయ్య పాల్గొన్నారు.

8 నుంచి సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు



మాట్లాడుతున్న వందవాసి నాగరాజు

తిరుపతి కల్చరల్ : తిరుపతిలో మే 8 నుంచి మూడు రోజులపాటు సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు తెలిపారు. శుక్రవారం యశోదనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ సమావేశాలకు సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ.బేబీ, జాతీయ నేతలు బీవీ.రాఘవులు, వి.శ్రీనివాసరావు హాజరు కానున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి కె.వేణుగోపాల్, నేతలు టి.సుబ్రమణ్యం, ఎస్.మాధవ్, పి.బుజ్జి, పి.చిన్న, పి.రమేష్, ఎం.జయంతి పాల్గొన్నారు.

బియ్యం కోతపై డీలర్ల ఆవేదన



మాట్లాడుతున్న తహసీల్దార్ శివరామసుబ్బయ్య

చంద్రగిరి : కార్డుదారులందరికీ సరిపడా రేషన్ బియ్యం సరఫరా చేయకుండా కోత విధించడంపై డీలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల రెవెన్యూ కార్యాలయంలో రేషన్ డీలర్లతో తహసీల్దార్ శివరామసుబ్బయ్య సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ బియ్యం ఇప్పటికే గోదాముకు చేరిందని, కార్డుదారులందరికీ సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. పనపాకం రేషన్‌షాపులో అవకతవకలపై విచారణ చేపట్టామని, డీఎస్ఓ నేతృత్వంలో బియ్యం పంపిణీ పూర్తి చేశామని వెల్లడించారు. దీనిపై డీలర్లు మాట్లాడుతూ చౌకదుకాణాలకు సరిపడా బియ్యం రావడం లేదని, ఒక్కో షాపునకు 200 కేజీల నుంచి టన్ను వరకు కోత విధిస్తున్నారని వాపోయారు. దీంతో కార్డుదారులకు పూర్తిస్థాయిలో బియ్యం పంపిణీ చేయడం కష్టతరంగా ఉందని తెలిపారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ బియ్యం కొరత వచ్చిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సీఎస్ డీటీ గంగయ్య, గోడౌన్ ఇన్‌చార్జి ప్రసాద్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకే ప్రాధాన్యం

పాకాల : పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి నివారణకు అధిక ప్రాధాన్యమివ్వాలని ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ లోకనాథం అధ్యక్షతన మండల మీట్ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రైనేజీ, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. దామలచెరువు ఎంపీటీసీ సభ్యులు గౌతమి మాట్లాడుతూ కుక్కల గ్రామంలో ఎంపీపీ పాఠశాల, నివాసాల సమీపంలోని పెద్ద చెట్లు ప్రమాదకరంగా ఉన్నాయని, వాటిని వెంటనే తొలగించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యులు నంగా పద్మజారెడ్డి, ఎంపీడీఓ అరుణ, తహసీల్దార్ సంతోష్‌సాయి పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా బోర్డు

భాకరాపేట : ఎర్రావారిపాళెం మండలం ఉస్తికాయలపెంట క్రాస్ వద్ద కూటమి నేతలు ఆక్రమించిన ప్రభుత్వ భూమిలో ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు బోర్డు పెట్టారు. పచ్చనేతల కబ్జాలపై మండల మీట్‌లో ప్రజాప్రతినిధులు ప్రశ్నించడంతో శుక్రవారం సర్వేనంబరు 191 లోని 10 ఎకరాల సర్కారు భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకున్నారు.

విద్యార్థులే నవభారత నిర్మాతలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథి, వీసీ

తిరుపతి సిటీ : విద్యార్థులే నవ భారత నిర్మాతలని, అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆదికవి నన్నయ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రసన్నశ్రీ ఆకాంక్షించారు. శుక్రవారం పద్మావతి మహిళా వర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో కాలేజీడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసిన ప్రసన్నశ్రీ మాట్లాడుతూ వ్యక్తిగత అభివృద్ధితో పాటు సాటి మహిళల సాధికారితకు తోడ్పడాలని సూచించారు. తల్లిదండ్రులకు, వర్సిటీకి మంచి పేరుతీసుకొచ్చేందుకు కృషి చేయాలని కోరారు. మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా విద్యార్థినులను వర్సిటీ అన్ని రంగాలలో తీర్చిదిద్దుతోందన్నారు. ప్రతి విద్యార్థిని ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు. అనంతరం విద్యార్థినిల సాంస్కృతిక నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని, డీన్‌లు ప్రొఫెసర్ విజయలక్ష్మి, ప్రొఫెసర్ సుధ, ప్రొఫెసర్ గంగాభవానీ, ప్రొఫెసర్ మల్లికార్జున పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

తిరుపతి ఎడ్యుకేషన్ : పదోతరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆయా పాఠశాలల యాజమాన్యాలు శుక్రవారం అభినందించాయి.

'సుధహా'ప్రతిభ



కె.హారిక, ఎం.నితీష్

ఆర్‌సీ రోడ్డులోని సుధహా లిటిల్ సిటిజన్స్ హైస్కూల్ విద్యార్థులు పదోతరగతి ఫలితాల్లో ప్రతిభ చాటారు. కె.హారిక 576, ఎం.నితీష్ 571, బి.గురుప్రియతం 555 మార్కులు సాధించారు. విద్యార్థులను కరస్పాండెంట్ డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, డైరెక్టర్ రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి, హెచ్ఎం ఎస్.విష్ణు అభినందించారు.

'సిల్వర్ ఓక్స్' సత్తా



ఉత్తమ ఫలితాలు సాధించిన సిల్వర్‌ఓక్స్ విద్యార్థులు

భవానీనగర్‌లోని సిల్వర్ ఓక్స్ పాఠశాల విద్యార్థులు పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించారు. ఎం.హసిత 586 మార్కులు సాధించగా, 29మంది 550కిపైగా మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ కేఎస్ వాసు తెలిపారు.

'గురుకుల' విద్యార్థినుల ప్రతిభ



లోకేశ్వరి

తిరుపతి సిటీ : జూపార్క్ రోడ్డులోని మహాత్మ జ్యోతి బాపూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల (ఉదయమాణిక్యం) విద్యార్థులు 10వ తరగతి ఫలితాలలో సత్తా చాటారు. 75 మంది పరీక్షలకు హాజరు కాగా 73 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపల్ రేష్మ శుక్రవారం తెలిపారు. వీరిలో రావిళ్ల లోకేశ్వరి 575, నాగళ్ల హాసిని 572, తలారి జ్ఞానప్రియ 569 మార్కులు సాధించినట్లు వెల్లడించారు.

విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్‌లు



సర్టిఫికెట్ అందిస్తున్న వీసీ, అసోసియేట్ డీన్

తిరుపతి సిటీ : ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పశువైద్య కళాశాలలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్‌లను వీసీ రమణ, అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య అందించారు. వారు మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్‌లో భాగంగా విద్యార్థులకు ఏడు రోజుల పాటు తిరుపతి పరిసర ప్రాంతాలలోని 12గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించినట్లు వెల్లడించారు.

బీమా సంస్థలకు వడ్డన

తిరుపతి లీగల్ : వేర్వేరు కేసుల్లో సేవాలోపానికి పాల్పడిన రెండు బీమా సంస్థలవారు ఫిర్యాదీలకు పరిహారం చెల్లించాలని జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పు చెప్పింది. వెంకటగిరి, టీచర్స్ కాలనీకి చెందిన చెలికం గోపీకృష్ణారెడ్డి అనే ఫిర్యాదీకి రూ.8లక్షల పాలసీ సొమ్ముతోపాటు నష్టపరిహారం కింద రూ.50వేలు, ఖర్చుల నిమిత్తం రూ.10వేలు చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు టి.స్నేహలత ఆదేశించారు. అలాగే పుత్తూరు వాటర్ ట్యాంక్ వీధికి చెందిన న్యాయవాది కె.అజయ్ బాబు అనే ఫిర్యాదీకి బీమా సొమ్ము రూ.6,10,990తోపాటు పరిహారం కింద రూ.50వేలు, 6శాతం వడ్డీతో చెల్లించాలని, అలాగే ఖర్చుల కింద మరో రూ.10వేలు ఇవ్వాలని, మొత్తం 45 రోజుల్లో అందజేయాలని వినియోగదారుల కమిషన్ సభ్యులు నాగ శేఖర్ రెడ్డి స్పష్టం చేశారు.

పాకాల హైస్కూల్.. 123 మంది ఫెయిల్

- 173 మంది రాస్తే.. 50 మాత్రమే పాస్
- మండలంలో కేవలం 47శాతం మాత్రమే ఉత్తీర్ణత
- మండిపడుతున్న తల్లిదండ్రులు



పదో తరగతి పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులు (ఫైల్)

పాకాల : పదో తరగతి పరీక్షల్లో పాకాల మండలవ్యాప్తంగా ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులు దారుణంగా విఫలమయ్యారు. కేవల ఉత్తీర్ణత 47 శాతం మాత్రమే నమోదు కావడంతో తల్లిదండ్రులు మండిపడుతున్నారు. మండలంలో మొత్తం 6 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అందులో పదో తరగతి పరీక్షలకు 355 మంది విద్యార్థులు హాజరు కాగా, 166 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ఇది ప్రభుత్వం నిర్లక్ష్యమా..? లేక విద్యాశాఖ అలసత్వమా..? లేక ఎంఈఓలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు చేతకానితనమా అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలకు వేలు జీతాలు తీసుకుంటూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా చదువులు చెబుతున్నాం అంటూ కోతలు కోసే ఉపాధ్యాయులు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నిస్తున్నారు. విద్యాశాఖకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా పాకాల మండలంలోని ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రధానంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొత్తం 173 మంది విద్యార్థులు పరీక్ష రాస్తే కేవలం 50 మాత్రమే పాస్ కావడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 123 మంది ఫెయిల్ అయ్యారని వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి పాకాల మండలంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

తగ్గింది వాస్తవమే..



పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో పాకాల మండలం ఉత్తీర్ణత శాతం తగ్గింది వాస్తమే. ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారి సామర్థ్యాల మెరుగుపరుస్తాం. రాబోయే సప్లిమెంటరీ పరీక్షల్లో అందరూ ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపడతాం.

– బాబ్జీ, ఎంఈఓ, పాకాల